నమ్మలేని నిజాలు

భూమల రాక
భాగ్యనగర భోగం
విశ్వైక రాష్ట్రం.
శూన్య జీవితం
ఊహల ఊగిసలు
త్రిశంకు స్వర్గం.
అకాల వర్షం
మండె ఎండల కాలం
పంటకు తంట.
మింగె పాములు
భజన భజంత్రీలు
నేటి స్నేహాలు
నోట్ల కట్టలు
నల్లకోట్ల వాకిళ్లు
న్యాయం నవ్వింది

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

అందాలను పరవశిస్తు
ఎక్కుతుంటె అందలాలు !
ఉగ్ర కుట్ర కాల్పుల్లో
కాశ్మీరం అంధురాలు !
పచ్చని కొండల్లోన
పారినాయి నెత్తుటేర్లు !
కుచ్ఛిత పనిని సమిష్టిగ
కూల్చాలోయ్ కూకటేర్లు !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 24-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:208 పేజీలు:6 వెల: రూ.1/-


## ఉగ్రవాదుల చిత్రాలు విడుదల చేసిన నిఘా వర్గాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:జమ్మూ కశ్మీర్, అనంతనాగ్ జిల్లాలో ఉగ్రదాడికి పాల్పడిన ముష్కర్లను గుర్తించే పనిలో నిఘా వర్గాలు నిమగ్నమైనాయి. అందులోభాగంగా ముగ్గురు ఉగ్రవాదుల ఊహా చిత్రాలను బుధవారం విడుదల చేశాయి. మరోవైపు ఆ దాడిలో పాల్గొన్న మరో ఉగ్రవాది ఫొటోను సైతం ఇప్పటికే విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ కాల్పులకు తావే బాధ్యులమంటూ ఇప్పటికే లష్కరే తోయిబా ప్రకటించింది. ఆ సంస్థ టాప్ కమాండర్ సైఫుల్లా కసౌరి అలియాస్ ఖలీద్ ఈ ఘటనకు ప్రధాన సూత్రధారి అని నిఘా వర్గాలు స్పష్టం చేశాయి. అలాగే రావల్ కోట్‌లోని ఇద్దరు వ్యక్తులతో ఈ ఘటనకు ప్రమేయం ఉందని వెల్లడించాయి. ఆ దిశగా నిఘా వర్గాలు తమ దర్యాప్తును ముమ్మరం చేశాయి.

మరోవైపు ఈ ఘటనపై సమాచారం అందగానే విదేశీ పర్యటనలో భాగంగా దుబాయ్‌లో ఉన్న ప్రధాని మోదీ.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను అప్రమత్తం చేశారు. దీంతో అమిత్ షా హుటాహుటిన జమ్మూ కశ్మీర్ బయలుదేరి వెళ్లారు. అనంతరం స్థానిక భద్రతపై జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోపాటు సీఎం ఒమర్ అబ్దుల్లాతో సమీక్షించారు. అలాగే ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల ఎరివేతకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఇంకోవైపు విదేశీ పర్యటనను అర్థాంతరంగా ముగించికొని ప్రధాని మోదీ స్వదేశానికి తిరిగి వచ్చారు. అనంతరం జమ్మూ కశ్మీర్ భద్రతపై జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్‌తోపాటు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్‌తో మోదీ అత్యసవరంగా సమావేశమయ్యారు.

ఇంకోవైపు పహల్గాంలో ఈ ఉగ్రదాడి జరిగిన ప్రాంతాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో భారీగా సైన్యాన్ని మోహరించారు. అంతకుముందు అమిత్ షా.. ఉగ్రదాడిలో మరణించిన 28 మృతదేహాలకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారిని ఓదార్చి.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు బాధ్యులను వదిలి పెట్టే ప్రసక్తే లేదని బాధిత కుటుంబాలకు కేంద్ర మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. అదీకాక 2019లో పుల్వామా దాడి అనంతరం జరిగిన అతి పెద్ద ఘటనగా ప్రభుత్వం భావిస్తోంది.

### పహల్గామ్ ప్రతీకారం..

# బారాముల్లా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:కశ్మీర్‌లోని పెహల్గావ్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిలో సుమారు 26 మంది టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరవకముందే మరో ప్రాంతంలో ఉగ్రవాదులు చొరబాటుకు యత్నించారు. అప్రమత్తమైన సైన్యం వారి ప్రయత్నాన్ని విజయవంతంగా తిప్పికొట్టింది. కాల్పులు జరిపి వారిని మట్టుబెట్టింది.

బుధవారం ఉదయం బారాముల్లా లోని ఉరి వద్ద ఉన్న సర్జీవన్ ప్రాంతం గుండా సుమారు ముగ్గురు ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించారు. నియంత్రణరేఖ వద్ద అప్రమత్తమైన భద్రతా బలగాలు వారిని అడ్డుకున్నారు. చొరబాటు ప్రయత్నాన్ని సైన్యం విజయవంతంగా భగ్నం చేసింది. ఈ క్రమంలో అక్కడ భీకరమైన ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి.



భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. ఘటనాస్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది. కాగా, కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. అనంతనాగ్ జిల్లా పెహల్గామ్ పట్టణ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం పర్యాటకులే లక్ష్యంగా దాడికి తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారయాత్రకు వచ్చిన వారిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగవడ్డారు. ఈ అమానవీయ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తెలంగాణ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి మనీశ్ రంజన్, ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. దాడికి తామే పాల్పడినట్టు ఉగ్రసంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది.

## ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు : అమిత్ షా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. 'భారమైన హృదయంతో పెహల్‌గావ్ ఉగ్రదాడిలో మరణించిన వారికి అంతిమ నివాళులర్పిస్తున్నాను. భారత్ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం' అని షా తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు మృతులకు నివాళులర్పిస్తున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఇవాళ ఉదయం శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా.. పెహల్‌గామ్ ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారిని పరామర్శించి ఓదార్చారు. వారి వేదనను విన్నారు. ఈ సందర్భంగా తమ ఆప్తులను కోల్పోయిన వారు కేంద్ర మంత్రి ముందు కన్నీటి పర్యంతమయ్యారు. విహారయాత్ర కోసం వస్తే మావాళ్లను పొట్టన పెట్టుకున్నారంటూ రోదించారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై అడవిలో నుంచి హఠాత్తుగా ప్రత్యక్షమైన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలు, పిల్లలను వదిలిపెట్టి కంటికి కనిపించిన పురుషులను కాల్చుకుంటూ పోయారు. ఈ దాడిలో సుమారు 28 మంది టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## ఉగ్రవాదుల దాడిని సమస్త సమాజం ఖండించాలి : సీపీఎం




నాగర్ కర్నూల్, ఏప్రిల్ 23: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉగ్రవాదుల దాడులను వ్యతిరేకిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదుల చేసినది దుర్మార్గపు దాడి అని, సమస్త సమాజం ఈ దాడిని ఖండించాలని, ఇలాంటి విద్రోహ చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ఇంటెలిజెన్స్ వైఫల్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తుందని, ఇలాంటి దుర్మార్గులను ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కరికి ఐదు కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పొదిలి రామయ్య, గుంపల్లి అశోక్, జిల్లా నాయకులు నాగపూర్ మధు, యాదయ్య, సురేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం- రజతోత్సవ సభకు తరలిరండి : ప్రజలకు కెటీఆర్ పిలుపు



హైదరాబాద్, ఏప్రిల్ 23: హనుమకొండ ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి ఆ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు ఇచ్చారు.. వరంగల్ జిల్లాలో నేడు పర్యటించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి దగ్గర జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభ ప్రాంగణంలోనే ముఖ్య కార్యకర్తలతో సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ,.. బిఆర్ఎస్ కి ఒక విశిష్టత ఉందన్నారు.. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు రెండు మాత్రమే ఉన్నాయని , వాటిలో ఒకటి బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు.. తెలంగాణ ప్రజల గొంతుగా పార్టీ పేరు తెచ్చుకుంది బిఆర్ఎస్ అన్నారు.. ప్రజలు ఏ బాధ్యత ఇచ్చిన దాన్ని ప్రజల ఆకాంక్షల మేరకు పని చేస్తున్న పార్టీ అని కేటీఆర్ పేర్కొన్నారు.

కాగా, ఉద్యమ జిల్లాలో 1250 ఎకరాల ఏర్పాట్లు పరిశీలించామని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఏ మూల నుంచి వచ్చే ఏ ఒక్కరికికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.. 40 వేల వాహనాలు దూరం పెట్టి నడుచుకుంట రాకుండా సభ వేదిక దగ్గరనే పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు.. నాలుగు ఏరియాలో పార్కింగ్ సౌకర్యాలు ఉంటాయన్నారు వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మంచి నీటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు..

100 వైద్య బృందాలు అందుబాటులో ఉంచామని చెప్పుకొచ్చారు. ఇక, 20 అంబులెన్స్ అందుబాటులో ఉంచాం.. కరెంటు సమస్యలు లేకుండా 200 జనరేటర్లు సిద్ధం చేసుకుంటున్నామని కేటీఆర్ అన్నారు.

తెలంగాణలో చరిత్రలోనే ఇది అతి పెద్ద బహిరంగ సభ కాబోతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ను చూసేందుకు ఆయన మాటలు వినేందుకు పెద్ద ఎత్తున జనం చేందుకు సిద్ధం అవుతున్నారు.. సూర్యాపేట జిల్లా నుంచి, వర్ధన్న పేట నుంచి ఎడ్ల బండ్ల మీద సభకి వస్తున్నారు.. ఉద్యమ స్ఫూర్తి చాటుతున్నారు.. 2000 మంది వాలంటీర్లు పెడుతున్నాం.. నాలాల దగ్గర వాలంటీర్లు పెడుతున్నాం.. ప్రభుత్వం కూడా సహకరిస్తుంది.. మా ఏర్పాట్లు మేము చేసుకుంటున్నాం.. సాయత్రం 4 గంటలకు కేసీఆర్ సభ వేదికకు చేరుకుంటారు.. ఉదయం జండాలు ఎగురవేసి సభలకు బయలుదేరుతారు.. ఇప్పటి వరకు యంత్రాంగం సహకరిస్తోంది..

## ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



హైదరాబాద్, ఏప్రిల్ 23:పహల్గామ్ లో ఉగ్రవాదులు జరిపిన కాల్పులకు నిరసనగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కన్వీనర్ హరీష్ రావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలందరూ భిన్నత్వంలో ఏకత్వం లాగా బ్రతుకుతూ ఉంటే పాకిస్తాన్ కు అమ్ముడుపోయిన కొంతమంది దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్ర చేస్తున్నారన్నారు. జమ్ము కాశ్మీర్ లో పర్యటన కోసం వచ్చిన ప్రజలను విచక్షణా రహితంగా కాల్చి చంపడం చాలా బాధాకరమన్నారు. మీరు చేస్తున్న ప్రతి కుట్రను ఎదుర్కోవడానికి ఈరోజు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. మీరు నిజంగా యుద్ధాన్ని కోరుకుంటే భారత ఆర్మీతో తలబడాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ తేజ, ఉపాధ్యక్షుడు దయాకర్, శివ, సంపత్, మనీ రామకృష్ణ, బాలకృష్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.




## సిగ్గుపడుతున్నాం.. కశ్మీరీలు సిగ్గుపడుతున్నారు: మెహబూబా ముఫ్తీ

శ్రీనగర్, ఏప్రిల్ 23: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించడంపై పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ స్పందించారు. ఈ సంఘటనతో తమతోపాటు కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని తెలిపారు. గత కొన్నేళ్లుగా కశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటని అన్నారు. బుధవారం శ్రీనగర్‌లో పీడీపీ కార్యకర్తలతో కలిసి మెహబూబా ముఫ్తీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'ఇది మనందరిపై దాడి, అమాయకులను చంపడం భయానక చర్య, అమాయకుల హత్యలను ఆపండి' అని రాసి ఉన్న ప్లకార్డులను కార్యకర్తలు ప్రదర్శించారు.

కాగా, నిరసన ర్యాలీ తర్వాత మెహబూబా ముఫ్తీ మీడియాతో మాట్లాడారు. ఉగ్రదాడి అమాయక పర్యాటకులపైనే కాదని, కశ్మీరియత్‌పై కూడా జరిగిందని తెలిపారు. 'ఇది మాపై జరిగిన దాడి. మేం దీనిని ఖండిస్తున్నాం. దీనిని సహించబోం. హోం మంత్రి ఇక్కడ ఉన్నారు. దాడిలో ప్రమేయం ఉన్న ఉగ్రవాదులను గుర్తించాలి. అప్పుడు వీలైనంత త్వరగా శిక్షించవచ్చు' అని అన్నారు.మరోవైపు సరదాగా గడిపేందుకు కశ్మీర్‌కు వచ్చే అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి చేయడం అత్యంత పిరికి పని అని మెహబూబా ముఫ్తీ విమర్శించారు. 'మేం సిగ్గుపడుతున్నాం. కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని దేశ ప్రజలకు నేను చెప్పాలనుకుంటున్నా. ఈ బాధాకరమైన సమయంలో మేం మీకు అండగా ఉంటాం. నేరస్తులను ప్రభుత్వం పట్టుకుని శిక్ష విధించాలని మేం కోరుతున్నాం' అని అన్నారు.

కాగా, ఉగ్రదాడి భద్రతా లోపమా అన్న ప్రశ్నకు, రాజకీయాలు ఆడటానికి ఇది సమయం కాదని మెహబూబా ముఫ్తీ తెలిపారు. 'మా హృదయాలు బాధలో ఉన్నాయి. ప్రజల హృదయాలు పగిలిపోయాయి. జమ్ముకశ్మీర్, దేశం మొత్తం శోకసంద్రంలో ఉన్నది. ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధను మేం పంచుకుంటున్నాం. దేశ ప్రజలకు నేను క్షమాపణలు చెప్పాలనుకుంటున్నా' అని అన్నారు.

### చురక

పక్కలోని బల్లెములా
పాకిస్తాన్ ఉగ్రవాదం
కాశ్మీరులో జరిపే నేడు
కాల్పులతో నరమేధం
మతోన్మాద క్రూర హింస
మన్నించదు ఏ దేశం
మనుషులంతా ఒక్కటే
మరి ఎందుకు విద్వేషం



-వేల్పుల నారాయణ
9440433475

### నేటి కందం- నేటికి అందం

వివిధములగు స్థాయిలలో
చవిచూపుచు భవ్యమవ్య సంబంధములన్
ప్రవిమలమగు శాంతి కొరకు
నవిరళముగ కృషి సలిపెడి ఆర్యుల నెంతున్

(ఏప్రియల్ 24 శాంతి కొరకు దౌత్య దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

## 2017 నుంచి పార్టీలో ఉన్న వాళ్లకే కమిటీలలో చోటు -మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, ఏప్రిల్ 23: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్ట పరచాలని అభిప్రాయపడ్డారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్.. బ్రిటిష్ వాళ్ళతో కూడా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసిందని గుర్తు చేస్తూ, కాంగ్రెస్ పార్టీ విస్తృత భావజాలం ఉన్న పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ జాతీయ స్థాయి ఆలోచనలతో పార్టీ పని చేస్తుందని వెల్లడించారు.

నేడు హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మీనాక్షి మాట్లాడుతూ, జిల్లాకు ఇద్దరు పరిశీలకుల కేటాయించలన్నారు. . మండల అధ్యక్షుల ఎంపికకు ఐదుగురి పేర్లు.. బ్లాకు కాంగ్రెస్ కి ముగ్గురు పేర్లు పీసీసీకి ఇవ్వాలని కోరారు. 70 మంది పరిశీలకులకు ఆహ్వానం పంపించాలని కోరారు. ఇక ఈ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వాళ్ళను పరిశీలకులుగా పీసీసీ తొలగించింది. మీటింగ్ కి రాని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు మరో ఐదుగురు నేతలు పరిశీలకుల నుంచి వీళ్ళను తొలగించాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు జారీ చేశారు.



2017 నుంచి పార్టీలో ఉన్న వాళ్లకే

ఇక, 2017 నుంచి పార్టీలో ఉన్న వాళ్ళనే కమిటీలో ఉండాలని నటరాజన్ ఆదేశించారు. అలాగే, మహిళల ప్రాతినిధ్యం పెంచుకోవాలన్నారు..ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు జరగనున్నాయని ప్రకటించారు.

పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలి అని సూచనలు చేశారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్ గా పని చేయాలని హెచ్చరించారు. ఈ దేశంలోనే మొదటి సరిగా తెలంగాణలో కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. అలాగే, దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిదన్నారు.. అయితే, దేశంలో మోడీ సర్కార్, గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తమ ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి అని మీనాక్షి నజరాజన్ కాంగ్రెస్ పరిశీలకులను కోరారు.

పర్యాటకుల మృతికి సంతాపం

టీ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణు నాథ్, సీడబ్ల్యూసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు? సమావేశం ప్రారంభమైన అనంతరం జమ్మూ కాశ్మీర్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల మృతి పట్ల సంతాపం ప్రకటించారు.. హాజరైన సభ్యులు లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# అభ్యుదయ పథగామి మహాకవి శ్రీశ్రీ

శ్రీ శ్రీ జయంతి
30-4-2025 సందర్భంగా మరియు
మహాకవి శ్రీ శ్రీ 'మహాప్రస్థానం'
అమృతోత్సవం (1950-2025 )
75 సంవత్సరాల సందర్భంగా
శ్రీ శ్రీ 'మహాప్రస్థానం' పై
ప్రత్యేక వ్యాసం



-సబ్బని లక్ష్మీనారాయణ
మొబైల్: 8985251271

శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' 1950లో వెలువడింది. శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' రాయడం ఒక ఎత్తైతే చలం దానికి ముందు మాట రాయడం మరొక ఎత్తు. 'తన కవిత్వానికి ముందుమాట రాయమని శ్రీశ్రీ అడిగితే, కవిత్వాన్ని తూచే రాళ్ళు తన దగ్గర లెవ్వన్నాడు చలం. **"తూచవద్దు అనుభవించి పలవరించమ"** న్నాడు శ్రీశ్రీ. కొందరి ముందు మాటలు బలంగా ఉంటాయి, వారు వారి గండెల్ని దాచుకోరు మంచి రచనలని వ్యాఖ్యానించేప్పుడు, కొందరి ముందు మాటలు పేలవంగా ఉంటాయి, వారు బాగున్న రచనను కూడా బాగుంది అని ఎలుగెత్తి చెప్పడానికి కూడా వెనుకాడుతారు. శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' కు చలం రాసిన ముందు మాట చాలా గొప్పది.

ఇంకా శ్రీశ్రీ కవిత్వాన్ని గురించి చెపుతూ చలం ఇలా అంటాడు, 'తనకి, ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్, బహిర్ యుద్ధారావమే కవిత్వమంటాడు చలం. అందువల్లనే దిక్కుల్ని, దేవుళ్ని, అధికారుల్ని, వూగించి ప్రశ్నించే శ్రీశ్రీ పద్యాలు అంత అభిమానం చలానికి. నెత్తురూ, కన్నీళ్లు తడిపి కొత్త బినీనితిఇ తయారు చేశాడు శ్రీశ్రీ యీ వృద్ధ ప్రపంచానికి.' శ్రీశ్రీ పద్యాల గురించి ఇంకా చెపుతూ, "పద్యాలు చదువుతూ ఉంటే ఇవి మాటలు కావు, అక్షరాలు కావు - ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు- అతని హృదయంలోంచి మన హృదయంలోకి టతితీవఞబి గా పంపిన ఉత్సాహాలు, నెత్తురు కాలువలనిపిస్తుంది" అన్నారు.

మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని సాధారణీకరిస్తూ శ్రీశ్రీ కవిత్వాన్ని కృష్ణశాస్త్రి కవిత్వాన్ని పోలుస్తూ ఇలా చెప్పాడు చలం. "కృష్ణశాస్త్రి తన బాధను అందరిలోనూ పలికిస్తే శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు. కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ".

శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' పుస్తకం యొక్క గొప్పతనాన్ని గురించి చెపుతూ, చలం ఇలా అన్నాడు, 'శ్రీశ్రీ పుస్తకం కొని తీరికగా చదవండి. పద్యం పదిసార్లు చదువండి. ఏమీ అర్థం కాలేదా, ఏ యువకుడికో, భిక్షకుడికో ఆవజీబిప్తఎవట జూతీవబవనిబి గా పంపండి, పారెయ్యకండి. అంత కన్నా దాచుకొండి. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వశక్తి మీ చేతిలో పుస్తకం ఖజీబబ తిబి నీని " అని చెప్పారు.

తెలుగు సాహితీ జగత్తును తనదైన బలమైన ముద్రతో కదిలించిన మహా రచయిత చలం ఈ ముందుమాటను 17-7-1940 నాడు బెజవాడ నుండి వ్రాశారు. శ్రీశ్రీ పుట్టింది 30-04-1910 నాడు అప్పటికి శ్రీశ్రీ వయస్సు 30 యేండ్లు, శ్రీశ్రీ మహా ప్రస్థానం గీతం రాసింది, 12-04-1934న మహాప్రస్థానంలోని కవితలన్ని శ్రీశ్రీ 1930- 1940 దశాబ్దంలో రాసినవి. అప్పుడే శ్రీశ్రీ కవిత్వం గొప్పతనమును గుర్తించి, ఊహించి ఇలా చెప్పాడు చలం ఇప్పటికి 85 సంవత్సరాల క్రితం, "ఈనాటి కవిత్వమంతా ఏమిటి? ఎందుకు ఉంది? ఏం చేస్తుంది?" అని ధిక్కరించి అడిగే తెలుగు ప్రజకు శ్రీశ్రీ కవిత్వం ప్రత్యుత్తరం. కొద్ది రోజుల్లో నేడు విర్రవీగే కవులు ప్రతి ఒక్కరూ శ్రీశ్రీ నీడ కింద నించుని తమ ఉనికిని సమర్థించుకోవలసిన గతి వస్తుంది." అని చెప్పారు. ఆధునిక తెలుగు కవిత్వం శ్రీశ్రీ ప్రవేశంతో ఒక నూతన గతిని ఆవిష్కరించి 1940 నుండి... ఆ ప్రవాహవేగం 1970 - 1980 వరకు ఉన్నదంటే అతిశయోక్తి కాదు, శ్రీశ్రీ కవిత్వం ప్రవాహవేగంలో పడి కొట్టుకపోని కవి ఉండడంటే కూడా అతిశయోక్తి కాదు. మహాప్రస్థాన కవితల రచన మొత్తంగా 1930 దశకంలో జరిగింది. మరీ ముఖ్యంగా 1934కూ 1940కీ నడుమ వ్రాసినవాటిలో గొప్ప కవితలను ఎంచుకుని 1950లో ప్రచురించారు శ్రీశ్రీ.

శ్రీశ్రీ కవితల్లోని, అగ్గిపుల్ల, కుక్కపిల్ల లాంటి కవితా వాక్యాల గురించి చెపుతూ, "అగ్గిపుల్ల వంక - ముఖ్యంగా పుచ్చిన అగ్గిపుల్ల వంక చాలాసేపు చూడమంటాను. కుక్కపిల్లని ముఖ్యంగా తల్లి చచ్చిన దిక్కులేని గజ్జికుక్క పిల్లని పెంచమంటాను' అని అన్నాడు చలం.

అంటే కవి చూడవలసింది కష్టాన్ని అని, కవి చూడవలసింది కరుణతో అని సెలవిచ్చాడు చలం.

ఇంకా శ్రీశ్రీ వాడిన పదసంపద గురించి చెపుతూ, **"పాతపదాలు, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోవీ, జీవితంలోవీ ఇంకా మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరక్కొట్టాడు శ్రీశ్రీ"** అన్నాడు చలం.

ఒక విమర్శకుడు చెయ్యవలసిన పనిని ఒక సమీక్షకుడు చెయ్యవలసని పనిని శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కు ముందుమాట రాస్తూ, కవిత్వాన్ని విశ్లేషిస్తూ అద్భుతమైన యోగ్యత పత్రం ఇచ్చాడు చలం.

శ్రీశ్రీ కవిత్వ పరిధి, లక్ష్యంను గురించి చెప్తూ

**"ఏ లోకంలో అన్యాయాలు, అధికారాలు, ఏడుపులు, క్షామాలు, యాచకాలు, క్షుద్ర కవిత్వాలు, శిక్షలు, Scandals లేవో ఆ లోకాన్ని Dream చేస్తున్నాడు యీ కవి"** అన్నాడు చలం.

ఇంకా **" శ్రీశ్రీ ఎందుకు నచ్చుతాడు?"** అనే ప్రశ్న వేసుకొని, ఇంకా రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటూ దీనంగా పలవరించే సమయాన ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు శ్రీశ్రీ!" అంటూ శ్రీశ్రీ కవిత్వంకు దిశానిర్దేశంను తెలియజెప్పాడు చలం.

"మీకు కవిత్వం కావాలా?" అయితే ఎలాంటి కవిత్వం కావాలి అంటూ, "అరుగో ఆ మూల పాత గోడలకేసి మొహాలు తిప్పుకొని నగిషీలు చెక్కుతున్నారు- పాత పదాలకి, ఊహలకి, చిత్రికలు పట్టె- ప్రేయసి మెల్లె కన్నుల మీద పద్యాలు అల్లుతున్నారు - రామాయణాలు, శర్మిష్ఠలూ, వృద్ధమునులు వ్రాసి అర్పిస్తున్నారు, "భారతి"కి నైవేద్యంగా, వాళ్ళలో చేరండి. వాళ్ళ ధైర్యవచనాలను విని మళ్ళీ నిద్రపొండి."

**"రాబందుల రెక్కల చప్పుడు
పయోధర ప్రచండ ఘోషం
ఝంఝానిల షడ్జ ధ్వానం"**

విని తట్టుకోగల చావ వుంటే ఈ పుస్తకం తెరవండి. అని శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గొప్పతనాన్ని 85 యేళ్ళ కింద లోకానికి ఎలుగెత్తి చాటాడు చలం. చలం మాటలు అక్షరసత్యాలు. చలం చెప్పినట్లు శ్రీశ్రీ యొక్క సాహితీ ప్రభ చాలా గొప్పది. మహాప్రస్థానానికి చలం 'యోగ్యతాపత్రం' చాలా విలువైనది. సమీక్షకులు, సాహితీ విమర్శకులు అనేవాళ్ళు తెలుసుకోదగిన, నేర్చుకోదగిన ఎన్నో విషయాలు ఉన్నాయి అందులో.

ఇక **'మహాప్రస్థానం'** చలం యోగ్యతాపత్రం పక్కన పెడుతూ శ్రీశ్రీ కవిత్వంలోకి తొంగి చూస్తే...

శ్రీశ్రీ తన **'మహాప్రస్థానం'** కవితా సంకలనాన్ని అర్ధాంతరంగా అసువులు బాసిన తన మిత్రుడు 'కొంపెల్ల జనార్దన్ రావు కోసం' అంకితం చేసారు.

**"దొంగ లంజకొడుకులసలే మెసలే
ఈ ధూర్తలోకంలో నిలబడ జాలక
తలవంచుకునే వెళ్ళిపోయావా, నేస్తం!
చిరునవ్వులనే పరిషేచన చేస్తూ.......?** అంటూ...

శ్రీశ్రీ తన 'మహాప్రస్థానం' గీతాన్ని 12-04-1934 లో రాశారు. ప్రభావాలు, పరిమితులు ఏమై ఉన్నా... సర్వ ప్రపంచంలోని ప్రజల కష్టాలు, బతుకు బాధలు, బరువులు ఒక్కటే అంటూ, తన కవిత్వాన్ని శ్రామిక జన జీవనానికి అంకితం చేశారు శ్రీశ్రీ.

శ్రీశ్రీ కవిత్వాన్ని తొలిసారి చదివినవారు మంత్రముగ్ధులై ఆ కవిత్వ జలపాత వేగంలో పడి కొట్టుకొని పోకుండా ఉండరు.

**"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది !
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం, పోదాం పైపైకి !"**

అంటూ జలపాత వేగంతో మొదలవుతుంది మహాప్రస్థానగీతం.

శ్రీశ్రీ కవిత్వంలో అద్భుతమైన శక్తి ఉంటుంది. ఆ శక్తి మనల్ని తన కవిత్వంతోతోలుకపోతుంది. అలా, ఆ కవితా శక్తి ఎందరో కవుల్ని ఆకర్షించింది.

ఇంకా 'మహాప్రస్థానం' గీతంలో ఇలా చెప్పాడు శ్రీశ్రీ,

**"ఎముకలు క్రుళ్ళిన,
వయస్సు మళ్ళిన
సోమరులారా! చావండి
నెత్తురు మండే,
శక్తులు నిండే
సైనికులారా! రారండి!
"హరోం హరోం హర!
హర! హర! హర! హర!
హరోం హరా ! అని కదలండి
!"** అని

ఇలా శ్రీశ్రీ కవిత్వం మనల్ను తన కవిత్వంతో పాటు ముందుకు ఉరికిస్తుంది..

**"త్రాచుల వలెనూ,
రేచుల వలెనూ,
ధనుంజయునిలా సాగండి"** అని

చెప్పిన శ్రీశ్రీ కవిత్వంలో, అద్భుతమైన పురాణ ప్రతీకలున్నాయి, ప్రకృతి చిహ్నాలు ఉన్నాయి. కవిత్వాన్ని అద్భుతంగా పండించడానికి అలా ప్రతీకల్ని వాడుకొంటారు ప్రతిభావం తులైన కవులు.

శ్రీశ్రీ, 'మహాప్రస్థానం' గీతంలో 'హరోం హరా!' శివ సముద్రం, 'ధనుంజయునిలా' లాంటి పురాణ ప్రతీకలు, 'అవతారం' కవితలో యముని మహిషపు లోహ ఘంటలు, నరక లోకపు జాగిలమ్ములు, మదపు టేనుగు, నందికేశుడు రంకెవేస్తూ, ఆది సూకర వేద వేద్యుడు లాంటి పురాణ ప్రతీకలు వాడినాడు. 'ఐ' అనే కవితలో భూతాన్ని, యజ్ఞోపవీతాన్ని, కేదార గౌళ లాంటి పదాలు వాడినాడు.

శ్రీశ్రీ కవిత్వానికి అంత పదునును, శక్తిని, వాడిని ఇచ్చింది ఈ పురాణప్రతీకలు,

ప్రకృతి చిహ్నాలే.

'జగన్నాథుని రథచక్రాలు' అనే కవితలో...

**పతితులార!
భ్రష్టులార!
బాధాసర్పదష్టులార !
.......
శనిదేవత రథ చక్రపు
టిరుసులలో పడి నలిగిన
దీనులార ! హీనులార !...!"**

అంటూ

పతితులను, దీనులను, కూడులేని, గూడులేని నిర్భాగ్యులను ఉద్దేశించి,

**"వస్తున్నాయి యొస్తున్నాయి...
జగన్నాథ,
జగన్నాథ,
జగన్నాథ రథచక్రాల్.....
జగన్నాథుని రథచక్రాల్.....'**

అంటూ వారికి ఓదార్పుగా కవితల్లాడు శ్రీశ్రీ.

సమ సమాజాన్ని, సామ్యవాదాన్ని కాంక్షిస్తూ,

**స్వాతంత్ర్యం
సమభావం,
సౌభ్రాత్రం,
సౌహార్దం
పునాదులై ఇళ్ళు లేచి
జనావళికి శుభం పూచి
శాంతి, శాంతి, కాంతి, శాంతి
జగమంతా జయిస్తుంది!**

అంటూ సర్వజనుల శుభం కాంక్షించాడు శ్రీశ్రీ.

ఇంకా, **"పతితులార !
భ్రష్టులార !
బాధాసర్పదష్టులారా!
దగాపడిన తమ్ములారా!
ఏడవకండేడవకండి !
వచ్చేశాయ్, వచ్చేశాయ్ !
......
జగన్నాథ రథచక్రాల్,
రథ చక్రాల్, రథ చక్రాల్,
రారండో! రండో ! రండి !
ఈ లోకం మీదేనండి !
మా రాజ్య మీరేలండి'** అని

కాంక్షించి,

పతితులను, బాధాసర్పదష్టులను, దగాపడిన తమ్ములను ఉద్దేశించి కవిత్వమల్లిన శ్రీశ్రీ నుద్దేశించి, శ్రీశ్రీ కవిత్వంలో పురాణ ప్రతీకలున్నాయని, కుల చిహ్నాలున్నాయని, శ్రీశ్రీ బ్రాహ్మణవాద కవి అని, అభ్యుదయ వాది కాదని అన్న సమీక్షకులు, విమర్శకులు కూడా ఉన్నారు. కాని కష్టానికి, కన్నీటికి, బాధలకు కులాలు, మతాలు, ఎల్లలు లేవు. బాధలు, కష్టాలు, కన్నీళ్ళు ఒకటే. అలా అన్న కవులకు, సమీక్షకులకు,

**"శ్రీశ్రీ ఏకులంలో పుట్టినవాడు
అరిస్టాటిల్ ఏ జాతికి చెందిన
వాడు
అస్థిత్వం కోసం ఎవరి జెండాను
వారు ఎగరేసుకునే క్రమము
లో...."** వారివారి వాదాల మనుగడ ఎలా ఉంటుందో కాలం చెబుతుందని చెప్పాలి. కొన్ని విశ్వజనీన సత్యాలుంటాయి. వాటిని ప్రకటించ డానికి ప్రతిభావంతులైన కవులకు కులాలు, మతాలు అడ్డు కావు.

శ్రీశ్రీ 1933 లో రాసిన **'జయభేరి'** కవితలో, అప్పటికి శ్రీశ్రీ వయసు 23,

ఇలా అన్నాడు ఆత్మ విశ్వాసంతో.

**"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను !'
.....
"నేను సైతం
విశ్వసృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను !"
......
"నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకిలేస్తాను!'**

శ్రీశ్రీ తన పథ నిర్దేశంను ఆత్మవిశ్వాసంతో ముందుగానే ప్రకటించు కొన్న కవితా

ప్రస్థానం ఇదే !

శ్రీశ్రీ కవిత్వం అద్భుత శబ్ద సౌందర్యంతో నిండి ఉంటుంది. శ్రీశ్రీ వాడిన పదాల విన్యాసం గొప్పది. శ్రీశ్రీ వాడిన పదాల్లో అద్భుతమైన శక్తి ఉంది. గణ గణ గంటలు కొట్టించిన ధ్వని ఉంది.

**'గంటలు! గంటలు !
గంటలు! గంటలు !
కర్మాగారం, కళాయతనమూ,
కార్యాలయమూ, కారాగృహముల,
దేవుని గుడిలో, బడిలో, మడిలో
ప్రాణము ప్రోగే ప్రతి స్థలములో,
నీ హృదయంలో, నా హృదయంలో
గంటలు ! గంటలు !
గంటలు ! గంటలు !"** అన్నాడు శ్రీశ్రీ, 'గంటలు' అనే కవితలో.

**'ప్రపంచమొక పద్మవ్యూహం!
కవిత్వమొక తీరని దాహం !'**

అన్నాడు శ్రీశ్రీ 'బుక్కులు' అనే కవితలో

'కాదేది కవిత కనర్హం, హీనంగా చూడకు దేన్నీ, కవితామయమేనోయే అన్నీ",

అంటూ...

**'కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా,
.........
రొట్టెముక్కా, అరటితొక్కా, బల్లచెక్కా
...........
తలుపు గొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపు కళ్ళెం.....,**

అంటూ అన్నీ కవితా వస్తువులేనన్నాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీ, 'బుక్కులు' అనే కవితకు ముగ్ధుడై రా.వి. శాస్త్రి 'కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బు బిళ్ళా... అంటూ పై పదాలన్నింటితో 'బుక్కులు' అనే తొమ్మిది కథలు రాశాడు.



శ్రీశ్రీ కవిత్వం కవులతో కవిత్వం రాయించింది, కథకులతో కథలు రాయించింది, చిత్రకారులతో చిత్రాలు వేయించింది, పేరడి కవులచే పేరడీలు రాయించింది. సామాన్య పాఠకులను విరివిగా ఆకట్టుకొంది ఇలా.

అందుకే,

"జనం నోళ్ళలో
ఎవరు జపమాల అవుతాడో,
మౌనిలా రాస్తూ పోతాడో"

అలాంటి కవిని, మహాకవి అనవచ్చు... అలా శ్రీశ్రీ జనం నోళ్ళలో జపమాల

అయిన మహాకవి!

శ్రీశ్రీ కవిత్వంతో "Quotable Quotes" అన దగ్గ కవితా పంక్తులు విరివిగా దొరుకుతాయి. అవి జనుల నోళ్ళల్లో నర్తించాయి. బహుజనాదరణ పొంది నాయి. అలనాటి వేమన పద్యాల్లాగా, ఈనాటి శ్రీశ్రీ కవితాపంక్తులు కూడా జనులకు దగ్గరయినాయి. శ్రీశ్రీ కవితా శక్తి అంతటిది.

ప్రకృతిపై, ప్రకృతిలో ప్రతి వస్తువుపై మమకారం ఉండాలి కవికి. ప్రకృతికి, పిల్లల ఆనందానికి దగ్గరి సంబంధమేమో.

శ్రీశ్రీ 'శైశవగీతి' అనే చక్కటి కవిత వ్రాశారు పిల్లలపై, ప్రకృతిలోని అందాలను అనుసంధానిస్తూ, పిల్లలను పిట్టలతో, చిరుతలతో, ఉడుతలతో, బుడుతలతో పోలుస్తూ:

**"పాపం, పుణ్యం, ప్రపంచమార్గం
కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ,
ఏమీ ఎరుగని పూవుల్లారా !
అయిదారేడుల పాపల్లారా !
మెరుపు మెరిస్తే,
వాన కురిస్తే,
ఆకసమున హరివిల్లు విరిస్తే,
అవి మీకే అని ఆనందించే
కూనల్లారా !..."** అంటూ

శ్రీశ్రీ ఏ కవితను ముట్టుకొన్నా అది ఒక అద్భుత కవిత్వరాశి. అది ఒక పద సౌందర్యాల సమాహారం, అది ఒక జలపాత వేగంలాంటి ప్రవాహం, అది ఒక మాటల మంత్రం, మార్మిక తంత్రం, రస సౌందర్యం.

కవిత్వం ఆత్మవిశ్వాసాన్నివ్వాలి, కవిత్వం ఆలంబన కావాలి మనిషికి జీవితంలో కష్టాల్లోను, నష్టాల్లోనూ.

**'కళారవి'** అనే కవితలో శ్రీశ్రీ ఇలా అన్నారు,

**'పోనీ, పోనీ,
పోతే పోనీ !
సతుల్, సుతుల్, హితుల్ పోనీ
!
పోతే పోనీ!
రానీ, రానీ
వస్తే రానీ! కష్టాల్, నష్టాల్,
కోపాల్, తాపాల్, శాపాల్ రానీ!
వస్తే రానీ !**

సుప్రసిద్ధ సినీ దర్శకులు బాలచందర్ గారి **'ఆకలి రాజ్యం'** సినిమాలో కమల్ హాసన్ నిరుద్యోగిగా అలమటిస్తూ, అర్ధాకలితో కాలం గడుపుతూ,

ఆవేశంతో పలుకుతాడు పై కవితా వాక్యాలను, తమిళంలో బాలచందర్ గారి ఆ సినిమాలో కవి యొక్క కవితలను వాడుకోవడానికి ప్రసిద్ధ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతిని ఎన్నుకొన్నారట. తెలుగులో **'ఆకలి రాజ్యం'** సినిమాకోసం శ్రీశ్రీ కవిత్వాన్ని ఎన్నుకొన్నారు దర్శకులు. శ్రీశ్రీ కవిత్వం అలా చాలా గొప్పది జనం దగ్గరకు వెళ్ళిపోవడానికి.

ప్రియురాలి కనులనో, చనుమొనలనో, అంగాంగ వర్ణనలనో, తన వ్యక్తిగతాన్నో అద్భుతంగా వర్ణిస్తూ రాసే కవి కన్న, ఆకలితో కేకలేసి, ఆర్తితో అలమటించేవారి కోసం రాసే కవే గొప్పవాడు. శ్రీశ్రీ ఆర్తుల కోసం, పేదలకోసం, బీదల కోసం రాసిన కవి. అందుకే గొప్ప కవి!.

కవికి కరుణాహృదయం ఉండాలి, దయాహృదయం ఉండాలి అపుడే ఈ ప్రపంచంలోని సమస్యలను, కష్టాలను, అవగతం చేసుకొని విశ్లేషించే శక్తి ఉంటుంది.

'భిక్షువర్షీయసి' అనే కవితలో,

**"దారి పక్క చెట్టుకింద
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసల్దొకతె
మూలుగుతూ, ముసురుతున్న
ఈగలతో వేగలేక"
....
....
"ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవ్వరిదని
వెర్రి గాలి ప్రశ్నిస్తూ
వెళ్ళిపోయింది!"** అంటాడు శ్రీశ్రీ

**"ముగ్గుబుట్ట వంటి తలా,
ముడతలు తేలిన దేహం, కాంతి లేని గాజు కళ్ళు, తనకన్నా శవం నయం"**

అనిపించేలా ఉన్న నిర్భాగ్యపు ముసలి తల్లి గురించి రాస్తూ.

ఒక కవి యొక్క గొప్పతనాన్ని ఇంకొక గొప్ప కవి పట్టుకొంటాడు, తన యొక్క గొప్పతనాన్ని ఆ కవిలో చూసుకొంటాడు కూడా. 'స్విన్ బర్న్ కవి' అనే కవితలో...

**"విషం కక్కే భుజంగాలో
కదం త్రొక్కే తురంగాలో
మదం పట్టిన మతంగాలో కవీ
! నీ పాటల్"** అంటూ

ఇంకా **"కవీ ! నీ గళ గళన్మంగళ
కళా కాహళ హళాహలిలో
కలిసిపోతిని! కరిగిపోతిని
కానరాకే కదిలి పోతిని ! "**

అని స్విన్ బర్న్ కవి కవిత్వంలో తనను తాను చూసుకొంటాడు శ్రీశ్రీ.

ఇంకాను, A.C. Swinburne తన రచనలలో, ముఖ్యంగా ం A Match గీతంలో చూపిన మార్గానికి కృతజ్ఞతతో అంటూ 'అద్వైతం' అనే అద్భుతగీతం వ్రాశారు శ్రీశ్రీ....

**"ఆనందం అర్ణవమైతే
అనురాగం అంబరమైతే
అనురాగపు టంచులు చూస్తాం
ఆనందపు లోతులు తీస్తాం"** అని

శ్రీశ్రీ రాసిన పాటలు కొన్ని లలిత గీతాలుగా, రేడియో గీతాలుగా పాడబడ్డాయి. శ్రీశ్రీ వాడిన పద సౌందర్యం గొప్పది పై పాటలో. శ్రీశ్రీ రాసిన 'మహాప్రస్థానం' గీతాలను కొన్ని సినిమాల్లోనూ పాటలుగా, కవితలుగా వాడుకొన్న సందర్భాలు ఉన్నాయి. పాటలకు ప్రాణం పోసిన మహానుభావుడు శ్రీశ్రీ.

ఇక శ్రీశ్రీ తెలుగు కవిత్వ సీమలో అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడు. శ్రీశ్రీ 'అభ్యుదయం' అనే కవితను 1937 వ సంవత్సరంలో రాశారు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య క్షేత్రంలో సంప్రదాయ కవిత్వం నుండి, భావ కవిత్వ ఛాయలను దాటి శ్రీశ్రీ 'అభ్యుదయం' తో అది అభ్యుదయ కవిత్వమయింది. శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడు, అభ్యుదయ కవిత్వ పథగామి.

శ్రీ శ్రీ కవితలు తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవిత్వమనే కవితావిప్లవాన్ని సృష్టించడానికి ఒకానొక కారణంగా భావించారు శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని విశ్లేషిస్తూ శ్రీఅద్దేపల్లి రామమోహన రావు గారు.

**"నేడే, ఈనాడే, ఈనాడే...
జగమంతా బలి వితర్ది !
నరజాతికి పరివర్తన!
నవజీవన శుభ సమయం !
అభ్యుదయం !"** అని ప్రకటించాడు శ్రీశ్రీ. నేటికి ఎనభై ఎని మిది యేళ్ళ క్రితం 1937లో.

'వ్యత్యాసం' అనే కవితలో... వ్యక్తుల సమూహాలను, వారి ఆచారాలను, అలవాట్లను, వారి జీవిత విధానాలను, వారి ఆలోచనల ను, వ్యవస్థ తీరు తెన్నులను ఉటంకిస్తూ బలమైన జాలి గొలిపే కవిత వ్రాశారు శ్రీశ్రీ.

**"అదృష్టవంతులు మీరు
వెలుగును ప్రేమిస్తారు,
ఇరులను ద్వేషిస్తారు.
మంచికి చెడ్డకీ నడుమ
కంచు గోడలున్నాయి మీకు"**

అంటూనే...

**'అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం...
ముళ్ళూ రాళ్ళూ అవాంతరాలెన్ని
ఉన్నా
ముందు దారి మాది"** అంటూ...

**'అభిప్రాయాల కోసం
బాధలు లక్ష్యపెట్టని వాళ్ళు
మాలోకి వస్తారు
అభిప్రాయాలు మార్చుకొని
సుఖాలు కామించేవాళ్ళు
మీలోకి పోతారు'** అని

వాస్తవాలను ఉన్నదున్నట్లు, మన గుండెల్లో దిగబడేట్టు తెలియజెప్పడం శ్రీశ్రీ యొక్క గొప్పతనం !

శ్రీశ్రీ ఏ కవితను ముట్టుకొన్నా అది ఒక అగ్ని కణం. ఆ కవితల్ని విప్పితే పూవులోని పరిమళంలా భావాలు పురివిప్పి లేస్తాయి నెమలి నాట్యంలా, వాటంతట అవే. శ్రీశ్రీ కవితలకు వాఖ్యానాలు రాయాలంటే ఒక్కొక్క కవితకు పేజీల తరబడి రాయచ్చు. శ్రీశ్రీ కవిత పాఠకుల్ని ఊగించి ఆడిస్తుంది. శ్రీశ్రీ కవిత్వం అద్భుత వీర రసవాహిని. దానిని వీరుల వలె గ్రోలాలి. ఆత్మవిశ్వాసాన్ని నింపుకోవాలి.

శ్రీశ్రీ **'ప్రతిజ్ఞ'** అనే కవితలో...

**'పొలాలనన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
విరామమెరుగక పరిశ్రమించే
బలం ధరిత్రికి బలి కావించే
కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మ జలానికి,
ఘర్మ జలానికి
ధర్మ జలానికి
ఘర్మ జలానికి ఖరీదులేదోయ్ !'**

అంటూనే శ్రమైక జీవనసౌందర్యానికి, సమానమైనది లేనేలేదని, కష్టజీవులకు, కర్మవీరులకు నిత్యమంగళం నిర్ధేశిస్తూ......

**'కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం,
జాలరి పగ్గం, సాలెల మగ్గం,
శరీర కష్టం స్ఫురింప జేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు-
నా వినుతించే,
నా విరుతించే,.......'** అని డెబ్బై ఐదు ఏండ్ల కింద

ప్రకటించిన మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని, అభ్యుదయ పథగామి అయి శ్రమజీవుల, సర్వ కులాల, ప్రగతిని కాంక్షించిన కవి యొక్క కవిత్వాన్ని ఈ నాటి వాదాల వారిగా విడిపోయిన కవులు ఏవాదానికి, ఏ గాటకు కట్టేస్తారో. స్త్రీ వాదమని, దళిత వాదమని, మైనారిటీ వాదమని, బి.సి. కవుల కవిత్వమని వచ్చిన నేపథ్యంలో డెబ్బై అయిదు ఏండ్ల నాడే ఈ నాటి ప్రగతిని కాంక్షించిన కవిని, ఆ కవి రాసిన కవిత్వాన్ని ఏ కోణంలో, ఏవాదం దృక్కోణంలో వీక్షిస్తారో నేటి వాదాల, ప్రతివాదాల కవులు.

ఇంకా మనుషుల్లోని, అల్పత్వాన్ని, దివాళాకోరుతనాన్ని తెలియజెపుతూ, 'చేదుపాట' కవిత ద్వారా,

**"మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగలం...!
వెనుక దగా, ముందు దగా,
కుడి యెడమల దగా, దగా"** అని

ఎప్పుడు చెప్పిన మాటలు ఇవీ? ఎవరికి వర్తించుకోవచ్చు వీటిని ? శ్రీశ్రీ చెప్పిన ఈ మాటల్ని బుద్ధి జీవులనే వాళ్ళు కాసేపు ఆలకించాలి.

ఇంకా, శ్రీశ్రీ కవితాభిమాని, రస సౌందర్యాభిమాని!

ఆంగ్ల సాహిత్యపు రొమాంటిక్ కవి, వర్డ్స్ వర్త్, చెప్పినట్లు 'మహాప్రస్థానం'లోని శ్రీశ్రీ కవిత్వ "Spontaneous, overflow of powerful feelings" అనే నిర్వచనానికి సరిపోతుంది. అందుకే అంత దూకుడుగా, అంత స్పందనతో వెలువడి, అంతే వేగంతో, స్పందనతో పాఠకుల హృదయాల్లోకి జొరబడింది.

ప్రతిభావంతులైన కవులు కవిత మీద కవితలు రాశారు, అలా శ్రీశ్రీ రాశారు, తిలక్ రాశారు, ఇంకెందరో కవులు రాశారు...

'కవితా! ఓ కవితా !' అనే కవిత ద్వారా...

**'కవితా! ఓ కవితా !
నా యువకాశల నవపేశల సుమగీతావరణంలో
నిను నేనొక సుముహూర్తంలో,
అతిసుందర సుస్పందనమందున
దూరంగా వినువీధుల్లో విహరించే
అందని అందానివిగా
భావించిన రోజులలో,
నీకై బ్రతుకే ఒక తపమై'
వెదుకాడే నిమిషాలందు నిషాలందున....'** అంటూ

కవిత్వాన్వేషణ గావిస్తూ,

తన భావి కవిత్వానికి మెనిఫెస్టోలాంటి వాఖ్యల్ని రాసుకొన్నాడు శ్రీశ్రీ 1937ల్లోనే.

**'నేనేదో విరచిస్తానని
నా రచనలలో లోకం ప్రతి ఫలించి,
నా తపస్సు ఫలించి,
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతి జనులు పాడుకొనే
మంత్రంగా మ్రోగించాలని....'**

కలలు గన్నాడు, కాంక్షించాడు శ్రీశ్రీ. అంతటి పేరును, కీర్తిని తన కవితా ప్రవాహం ద్వారా సంపాదించుకొన్నాడు శ్రీశ్రీ సాహితీలోకంలోను, జనం నోళ్ళలోనూ.

ఇక నవకవనానికి ఉండవలసిన లక్షణాల్ని గురించి చెపుతూ, 'నవకవిత' రాశారు

×××

"సింధూరం, రక్త చందనం,
బంధూకం, సంధ్యారాగం,
పులి చంపిన లేడినెత్తురూ,
ఎగరేసిన ఎర్రని జెండా,
రుద్రాలిక నయన జ్వాలిక,
కలకత్తా, కాళిక నాలిక
కావాలోయి నవకవనానికి..." అంటూ ప్రకటించిన మహాకవి,

**"కదిలేది, కదిలించేది,
మారేది, మార్పించేది,
పాడేది, పాడించేదీ
మునుముందుకు సాగించేదీ,
పెనునిద్దుర వదిలించేదే
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి.."**

అని కవిత్వ పథ నిర్దేశం చేశాడు శ్రీశ్రీ నవకవనానికి, నవకవికి.

**'ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి సమస్తం
పరపీడన పరాయణత్వం '**

అని శ్రీశ్రీ 'దేశచరిత్రలు' అనే ప్రసిద్ధ గీతం వ్రాశారు. ఈ 'దేశచరిత్రలు' కు మరింకొన్ని శ్రీశ్రీ ప్రసిద్ధ కవితలకు జరుక్ శాస్త్రి, మాచిరాజు దేవీప్రసాద్, శ్రీ కాత్రగడ్డ, ఈ వ్యాస రచయిత సబ్బని లక్ష్మీనారాయణ లాంటి వారు ప్రముఖంగా పేరడీలు రాశారు. అలా పేరడీలు రాయడానికి యోగ్యమైన కవితలు శ్రీశ్రీవే ఎక్కువ సాహితీజగత్తులో.

ఆత్మవిశ్వాసంతో, విద్వత్తుతో అద్భుత కవిత్వం రాసిన శ్రీశ్రీ

**"నేనొక దుర్గం !
నాదొక స్వర్గం !
అనర్గళం, అనితర సాధ్యం నా మార్గం !"** అని

ప్రకటించిన మహాకవి తన "మహాప్రస్థానం" ను తెలుగు సాహితీ జగత్తులో చిరస్థాయిగా నిలిపి 15-06-1983 నాడు తుదిశ్వాస విడిచారు మద్రాస్ లో. శ్రీశ్రీ పుట్టింది 30-4-1910 న విశాఖపట్నంలో.

శ్రీశ్రీ శతజయంతి 2009-2010లో వచ్చింది. ముందుగానే మేల్కొని "శ్రీశ్రీ ప్రియ శిష్యుడనహో" అంటూ 'చినుకు' సంపాదక వర్గ ప్రతినిధి సింగంపల్లి అశోక్ కుమార్ గారు శ్రీశ్రీ శతజయంతి కి రెండు మూడు ఏండ్ల

ముందే 'చినుకు' లో శ్రీశ్రీ పై క్విజ్ నిర్వహిస్తూ, తర్వాత మూడు నెలల కొకసారి శ్రీశ్రీపై ప్రత్యేక బులెటిన్ ను తీసుక వచ్చి శ్రీశ్రీ శతజయంతి సంరంభాన్ని ముందుగానే ప్రారంభించారు. కాలక్రమంలో ఈ పదిహేనేండ్లలో శ్రీశ్రీ సాహిత్యంపై శ్రీ శ్రీ పై వచ్చిన సాహిత్యంపై సింగంపల్లి అశోక్ కుమార్ ఇప్పటి వరకు" శ్రీ శ్రీ సాహిత్య నిధి" పేర 195 పుస్తకాలు ప్రచురించారు. అది గొప్ప విషయం, అందుకు వారు అభినందనీయులు.

శ్రీశ్రీ గురించి రాయాల్నంటే ఈ చిన్న వాస్యం చాలదు. ఏంతైన రాయొచ్చు. శ్రీశ్రీ పై కవితలు రాసిన కవులెందరో పరిశోధన వ్యాసాలు రాసిన వారు ఎందరో ఉన్నారు. శ్రీశ్రీకి పుస్తకాలు అంకితం ఇచ్చిన కవులున్నారు. ఈ వ్యాస రచయిత కూడా శ్రీశ్రీ ప్రసిద్ధ పదిహేను కవితలకు పేరడీలు రాసి, ఇంకా మిగతా ప్రసిద్ధ తెలుగు కవుల, రచయితల 25 రచనలకు పేరడీలు కలిపి... 'మన ప్రస్థానం' అనే పేరడీల సంకలనాన్ని శ్రీశ్రీ కి అంకితం చేస్తూ 2001లో విడుదల చేయడం జరిగింది.

శ్రీశ్రీ కవిత్వం ఒక జలపాత వేగం
శ్రీశ్రీ కవిత్వం అనితర సాధ్యం, అది తన మార్గం
శ్రీశ్రీ కవిత్వం భావితరాలకు మార్గదర్శకం

శ్రీ అంటేనే గౌరవవాచకం, మూడు శ్రీలతో మనగలిగిన శ్రీశ్రీశ్రీ ధన్యుడు

కదా! అది ఎందరికి సాధ్యం మరి?

